ప్రజాశక్తి

గురువారం 9 ఫిబ్రవరి 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

రెండు మండలాలుగా 'ఒంగోలు'

- గ్రామాలతో కలిపి రూరల్ మండలం ఏర్పాటు
- మున్సిపాల్టీ పరిధిలో అర్బన్ మండలంగా విభజన
- రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలు మండలం ఇక నుంచీ రెండు మండలాలుగా చీలిపోనుంది. జిల్లా కేంద్రంగా ఉన్న ఒంగోలు మండలాన్ని అర్బన్, రూరల్ మండలాలుగా విభజిస్తూ బుధవారం నాడు జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర వేశారు. మున్సిపాలిటి పరిధిలో ఉండే వార్డులు అన్నీ కలిపి అర్బన్ మండలంగా ఏర్పాటు కానుంది. రెవెన్యూ గ్రామాలుగా ఉన్న దేవరంపాడు, ఉలిచి, చేజర్ల, కరవది, మండువారిపాలెం, వలేటివారిపాలెం, యరజర్ల, సర్వేరెడ్డిపాలెంతో పాటు వాటి అనుబంధ ఆవాస గ్రామాలు రూరల్ పరిధిలోకి వస్తాయి. ఈ మేరకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. జిల్లా కేంద్రంతోపాటు చుట్టుగ్రామాలు కూడా ఇప్పటివరకూ ఇందులోనే ఉన్నాయి.అయితే ఇక్కడ జనభా పెరగడంతోపాటు రెవెన్యూ పరమైన కార్యకలాపాలు ఎక్కువగానే ఉంటాయి. మరోవైపు ప్రోటోకాల్ విధులూ తప్పనిసరి.ఈ నేపద్యంలో ఒంగోలు మండల రెవెన్యూ అధికారులకు ఇప్పటి వరకూ పనిభారంగానే ఉంది. దీంతో పాలనాసౌలభ్యం కోసం విభజన నిర్ణయం తీసుకున్నారు. గ్రామాలకు చెందిన రికార్డులను వేరుచేస్తారు.రూరల్ మండలానికి అప్పగించాల్సి ఉంది. పట్టణంలోని రెవెన్యూ రికార్డులు అన్నీ అర్బన్ మండల పరిధిలో ఉంటాయి. ఇద్దరు తహసిల్దార్లు ఉంటారు. అదే విధంగా అన్ని స్థాయిల్లోని ఉద్యోగులు కూడా పెరుగుతాయి.రెండు తహసిల్దారు కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండటం లేదనే చర్చ ఉంది.పట్టణంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంలోనూ జాప్యం జరుగుతోంది. ఇళ్ల స్థలాల వివాదాలే పెద్ద ఎత్తున ఉన్నాయి.వాటిని పరిష్కారం చేసే తీరిక కూడా ప్రస్తుతం ఉన్న సిబ్బందికి లేకుండా పోయింది.ఇక నుంచీ రెండు కార్యాలయాలు ఏర్పాటవుతున్నందున రెవెన్యూ పరమైన సమస్యలు చిక్కులు త్వరగానే వీడతాయని ఆశిద్దాం.

అదానీ కుంభకోణాలపై మౌనమెందుకు?

- టిడిపి, వైసిపి ఎంపీలు సమాధానం చెప్పాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

దేశాన్ని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా దోచుకుంటున్న అదానీ కుంభకోణాలపై పార్లమెంటులో జరుగుతున్న చర్చల్లో వైసిపి, టిడిపి ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నాడు ఒంగోలు వచ్చిన ఆయన సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గడిచిన నాలుగేళ్లలో ఇప్పటివరకూ ఏడాదికి రూ.45 వేల కోట్ల చొప్పున అప్పులు పెరిగాయన్నారు. ప్రస్తుతం రూ.4.45 లక్షల కోట్లకు అప్పు చేరిందన్నారు. ఇది రాష్ట్ర బడ్జెట్‌లో 25 శాతంగా ఉందన్నారు. అప్పులు తెచ్చినా ఈ రోజుకూ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, స్కీమ్‌వర్కర్లకు సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. బకాయిలు చెల్లించలేని పరిస్థితి వచ్చిందని అన్నారు. స్కూళ్లు, హాస్టళ్లలోని పిల్లలకు స్టేషనరీ, కనీసం సబ్బులు కూడా ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనం పథకానికి సరుకులు కూడా ఇవ్వడం లేదన్నారు. ఇంతటి ఆర్థిక సంక్షోభానికి ఎవరు కారణమని ప్రశ్నించారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌కు ముందే అప్పులపై శ్వేతపత్రం ప్రకటించాలని కోరారు. దేశంలో అన్ని ప్రతిపక్షాలూ పార్లమెంటులో అదానీ కుంభకోణాలపై జాయింట్ పార్లమెంట్ కమిటీ వేయాలని సుప్రీంకోర్టుతో విచారణకు డిమాండ్ చేస్తుంటే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షపార్టీలు రెండూ నోరు మెదడపం లేదన్నారు. ఈ రెండు పార్టీలు ప్రజల పక్షమా? అదానీ పక్షమా? తేల్చుకోవాలన్నారు. దొంగ కంపెనీల పేర్లతో షేర్లు కొనుగోలు చేయడం, రిగ్గింగులు చేయడం, హైజాక్‌లు చేయడం వల్ల రూ.3 లక్షల కోట్ల నష్టం జరిగిందన్నారు. ఈ కుంభకోణాలను అమెరికా నిఘా కంపెనీలు వెలుగులోకి తేవడంతో ఒక్కసారిగా అదానీ వ్యవహారం కుప్పకూలిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థపైనే ప్రభావం చూపిందన్నారు. ఎస్‌బిఐ, ఎల్ఐసి వంటి సంస్థలకు రూ.8 లక్షల కోట్లు వచ్చిందని చెప్పారు. ఎస్‌బిఐ, ఎల్ఐసి నుంచి ఎవరి అనుమతితో అదానీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారని ప్రశ్నించారు. ప్రధాని మోడీ ఆమోదంతోనే ఇదంతా జరిగిందన్నారు. ఎన్‌పిఏ పేరుతో ఈ కంపెనీల అప్పులను రద్దు చేస్తారని, దాని వల్ల ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు. దీనిపై పెద్ద దుమారం రేగుతున్నా వైసిపి, టిడిపి ఎంపీలు మౌనంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో కృష్ణపట్నం, గంగవరం పోర్టులను కూడా అదానీకి అమ్మేశారన్నారు. అన్ని రకాలుగా ▶ 2లో



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఏసీబీకి చిక్కిన కొండపి ఎస్ఐ, కానిస్టేబుల్

రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పోలీసులు

ప్రజాశక్తి-కొండపి

రూ.20 వేలు తీసుకుంటూ కొండపి ఎస్ఐ ఏసీబీకి పట్టుబడ్డ ఘటన కొండపిలో బుధవారం చోటుచేసుకుంది. కొండపి మండలం, కట్టావారిపాలెం గ్రామానికి చెందిన అంగలకుర్తి వెంకటేశ్వర్లుపై కొండపికి చెందిన వై.మల్లిఖార్జునరావు ఎస్సీ, ఎస్టీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ రామకృష్ణ వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి.. ఎస్సీ, ఎస్టీ కేసు రిజిష్టర్ చేయమంటావా.. రూ.లక్ష ఇస్తావా? అని డిమాండ్ చేశాడు. రూ.20 వేలు ఇస్తానని వెంకటేశ్వర్లు ఒప్పుకొని ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు బుధవారం రంగంలోకి దిగి.. ఎస్ఐ రామకృష్ణను, కానిస్టేబుల్ గోగుల కోటేశ్వరరావును లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా గుంటూరు ఏసీబీ డీఎస్పీ టి.వి.వి. ప్రతాప్‌కుమార్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గతంలో కూడా అంగలకుర్తి వెంకటేశ్వర్లు దగ్గర నుంచి ఎస్ఐ రూ.35 వేలు లంచం ▶ 2లో



ఏసీబీకి పట్టుబడ్డ ఎస్ఐ, కానిస్టేబుల్

అత్యాచారం చేసి..వీడియో తీసి..

- విద్యార్థినిని వేధించిన యువకుడు
- మానసిక క్షోభతో బాధితురాలి ఆత్మహత్య
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన..
- నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు

ప్రజాశక్తి-ముండ్లమూరు

ఇద్దరిదీ ఒకే గ్రామం కావడంతో తమ ఊరి వాడే కదా.. అని ఆ విద్యార్థిని యువకుడిని నమ్మింది. విద్యార్థిని నమ్మకాన్ని ఆసరాగా తీసుకున్న యువకుడు తనతో తీసుకెళ్లి.. ఆమెపై అత్యాచారం చేశాడు. వీడియోలు, ఫొటోలు తీసి.. ఆమెను బెదిరించాడు. తీవ్ర మనస్తాపానికి గురైన ఆ విద్యార్థినికి సంక్రాంతికి పండగకు ఊరు వచ్చి.. మనోవేదనతో పురుగు మందు తాగి.. ఆత్మహత్యకు పాల్పడింది. తర్వాత ఆమె సెల్‌ఫోన్‌ను పరిశీలించిన తల్లిదండ్రులు.. ఆలస్యంగా విషయం తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోలీసులు బుధవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.



నిందితుడు వెంకటనారాయణరెడ్డి (ఫైల్)

ఎస్ఐ సంపత్‌కుమార్ కథనం మేరకు.. ఉమామహేశ్వరపురం గ్రామానికి చెందిన గూడల సుబ్బారెడ్డి, వెంకటనరసమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారి పెద్ద కుమార్తె కిరణ్మయి(17) చదువులో ముందంజలో ఉండేది. ఎంసెట్‌లో మంచి ప్రతిభ కనపరిచి.. విశాఖపట్నంలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో సీట్ సంపాదించింది. కొన్ని రోజుల పాటు చదువు సజావుగానే కొనసాగింది. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చింది. ఇంటికి వచ్చిన తర్వాత కుటుంబ సభ్యులతోనూ, మరెవరితోనూ మాట్లాడకుండా మౌనంగా ఉంది. జనవరి 13న తల్లిదండ్రులు పొలం పనులలో నిమగ్నమైన సమయంలో మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన వారి బంధువులు ఒంగోలులోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా ▶ 2లో

జర్నలిస్టుగా మొదలై.. టిడిపికి అండగా నిలిచి..

- ఇది చీమకుర్తి వెంకటేశ్వర్లు ప్రస్థానం
- నేడు మూలగుంట పాడులో సంస్మరణ సభ

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఓ తెలుగు దినపత్రికకు జర్నలిస్టుగా తన ప్రస్థానం ప్రారంభించిన చీమకుర్తి వెంకటేశ్వర్లు అనంతరం టిడిపికి అండగా నిలిచారు. మొదట నుంచి టిడిపిలో ఉంటూ చివరి వరకూ పార్టీ కోసం పనిచేసిన వారిలో ఈయన ఒకరు. ఒకప్పుడు టిడిపి మండల అధ్యక్షుడు అంటే తెలియని పరిస్థితుల్లో శింగరాయకొండ మండల టిడిపి అధ్యక్షుడిగా 20 సంవత్సరాల పాటు పనిచేశారు. మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులుకు అత్యంత సన్నిహితంగా ఉంటూ శింగరాయకొండ మండలాన్ని టిడిపి కంచుకోట మార్చారు. మండలంలోని 10 గ్రామపంచాయతీల్లోనూ చీమకుర్తికి అనుచరులు ఉన్నారు. దామచర్ల కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉంటూ టిడిపిలో కీలకంగా ఉన్నారు. తన సతీమణి చీమకుర్తి రమణమ్మను శింగరాయకొండ మండల పరిషత్ అధ్యక్షురాలిగా గెలి



వెంకటేశ్వర్లు(ఫైల్)

పించుకున్నారు. నారా చంద్రబాబు నాయుడు వద్దకు వెళ్లి శింగరాయకొండ అభివృద్ధికి అప్పటి మంత్రిగా ఉన్న దామచర్ల ఆంజనేయులు సహ కారంతో నిధులు తీసుకొచ్చి అభివద్ధి చేసిన ఘనత ఈయనకే దక్కింది. చీమకుర్తి వెంకటేశ్వర్లు ఎంపిటిసిగా గెలుపొంది ప్రజలకు సేవలు అందించారు. ఆయన పెద్ద కుమారుడు చీమకుర్తి శ్రీకాంత్ తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశారు. రెండో కుమారుడు చీమకుర్తి కష్ణ ప్రస్తుతం టిడిపి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. టిడిపి అంటే చీమకుర్తి కుటుంబం అన్న రీతిలో ఆయన పార్టీ కోసం పనిచేశారు. ఆరోగ్యం బాగా లేనప్పటికీ టిడిపి గెలుపు కోసం తీవ్రగా తపించేవారు. కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామికి అత్యంత సన్నితంగా ఉంటూ



చంద్రబాబు నాయుడుతో చీమకుర్తి వెంకటేశ్వర్లు (ఫైల్)

ఆయన గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నం చేశారు. ఆరోగ్యం బాగా లేనప్పటికీ ఎన్నికల సమయంలో ఆయన మండలంలోని అన్ని గ్రామపంచాయతీలు తిరిగి పార్టీ అభివద్ధి కోసం పని చేశారు. నేడు శింగరాయకొండ మండలం మూలగుంటపాడులో చీమకుర్తి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ నిర్వహించనున్నారు.

అదానీ కుంభకోణాలపై మౌనమెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికి అన్యాయం చేస్తోన్న అదానీపై వైసిపి, టిడిపి ఎంపీలు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ఇక కేంద్ర బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం జరిగిందన్నారు. రాజధానికి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, ప్రకాశం వంటి జిల్లాలకు ప్రత్యేకంగా నిధులు కోరినా ఇవ్వలేదన్నారు. కర్ణాటకలో ఎన్నికల కోసం అప్పర్ తుంగభద్రకు రూ.5300 కోట్లు ఇచ్చి రెండు రాష్ట్రాల మధ్య వివాదాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై ఈ నెల 22 నుంచి 28 వరకూ ప్రచారోద్యమం చేపడుతున్నట్లు వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు అందరికీ ప్యాకేజీలు ఇచ్చాకే ప్రాజెక్టును ప్రారంభించాలన్నారు. ఈ ఏడాది ఆగస్టు వరకూ వయోపరిమితిని పరిగణలోకి తీసుకుని నిర్వాసితుల జాబితాను ఖరారు చేయాలన్నారు. ఫోన్ ట్యాపింగ్‌ల వ్యవహారం చట్టవిరుద్ధమన్నారు. దానిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కేంద్రం అన్ని పార్టీలపై నిఘా పెట్టినపుడు వైసిపి కూడా వ్యతిరేకించిందని గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్‌డి.హనీఫ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన కొండపి ఎస్ఐ, కానిస్టేబుల్

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారని బాధితులు తెలిపారన్నారు. ఎస్ఐ బెదిరింపులకు భయపడి వెంకటేశ్వర్లు ఏసిబిని ఆశ్రయించాడన్నారు. ఏ అధికారి అయినా లంచం అడిగితే 14400 అనే టోల్‌ఫ్రీ నెంబరు ఫోన్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సిఐలు శేషు, శ్రీనివాసరావు, అపర్ణ, ఎస్ఐలు ప్రసాదు, షరీఫ్ పాల్గొన్నారు.

నేడు సూర్యలంకకు మంత్రి రోజా రాక

బాపట్ల రూరల్: రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి రోజా గురువారం బాపట్ల సూర్యలంక తీరంలో పర్యటించనున్నారు. విజయవాడ ఉదయం 9 గంటలకు బయలుదేరి రోడ్డు మార్గం లో 10:30 గంటలకు సూర్య లంకకు చేరుకుంటారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి బయలుదేరి వెళ్తారు.

కణితిని చంపిన నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - పెద్దదోర్నాల

కణితిని చంపిన ఇద్దరు నిందితులను బుధవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కొర్రపోలు రేంజర్ ప్రసన్న జ్యోతి మాట్లాడుతూ కొర్రపోలు రేంజి పరిధిలోని పెద్ద మంతనాల మిరప తోటలో కణితిని చంపిన అర్తి వెంకటేశం, బైరబోయిన ఆంజనేయులును అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది సుభాని, భాను ప్రసాద్, మౌలాలి, తానీషా పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- బాపట్ల రూరల్

యుటిఎఫ్ మండల నూతన కమిటీని మహాసభలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల గౌరవ అధ్యక్షురాలిగా టి. శైలజ, అధ్యక్షుడిగా గోలి రవికాంత్ , మహిళా సహ అధ్యక్షురాలిగా జి.భారతి దేవి , సహాధ్యక్షుడిగా దాసరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి,తాత నాగ రామారావు ,కోశాధికారిగా పి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి మద్దాల సురేష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జడ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం చేసి.. వీడియో తీసి..

(మొదటిపేజీ తరువాయి)

మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో 14వ తేదీన కిరణ్మయి మృతిచెందింది. ఆ విద్యార్థినిని వారి సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు. కొన్ని రోజుల తర్వాత తల్లిదండ్రులు ఆమె ఫోన్‌ను పరిశీలించగా ఆ గ్రామానికి చెందిన చింతల మల్లికార్జునరెడ్డి ఫోన్ నెంబర్ ఉండటంతో 'మా అమ్మాయి ఫోన్‌లో నీ నెంబర్ ఎందుకుంది' అని ప్రశ్నించారు. అదే గ్రామానికి చెందిన విజయవాడలో చదువుతున్న చింతల వెంకటనారాయణరెడ్డి.. అతని ఫోన్ మీ అమ్మాయి ఎత్తటం లేదని, తన ఫోన్ తీసుకొని ఫోన్ చేసాడని చెప్పాడు. వారికి అనుమానం వచ్చి స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసు విచారణలో పలు విషయాలు వెలుగుచూశాయి. చింతల వెంకట నారాయణరెడ్డి వైజాగ్‌లో ఉంటున్న కిరణ్మయి హాస్టల్ దగ్గరకు వెళ్లి కిరణ్మయికి కొరియర్ వచ్చిందని తోటి విద్యార్థినులకు చెప్పి.. బయటకు పిలిచాడు. కిరణ్మయి బయటకు రాగా నమ్మకంగా ఆమెను బయటకు తీసుకెళ్లాడు. తనకు అనుకూలమైన ప్రదేశానికి తీసుకెళ్లి ఆమెపై రేప్ చేసి ఫోటోలు, వీడియోలు తీశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే ఫోటోలు, వీడియోలు యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. జరిగిన విషయాన్ని ఇటు తల్లిదండ్రులకు, అటు స్నేహితులకు చెప్పలేక మానసిక క్షోభకు గురై కిరణ్మయి ఆత్మహత్య చేసుకుంది. ఆమె తండ్రి సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు చింతల వెంకటనారాయణరెడ్డిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సంపత్ కుమార్ తెలిపారు.

బాలిక పట్ల అసభ్యకరంగా..

ముండ్లమూరు మండలంలోనే మరో వ్యక్తిపై బుధవారం పోక్సో చట్టం కింద మరో కేసు నమోదైంది. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలోని బొప్పిడివారిపాలెం గ్రామానికి చెందిన లామ్ గోవిందయ్య గ్రామంలో టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు. గ్రామానికి చెందిన ఎనిమిది సంవత్సరాల బాలిక టిఫిన్ సెంటర్‌కు వెళ్లి.. ఇడ్లీకట్టమని అడిగింది. ఆ బాలికకు ఇడ్లీ కట్టి ఇవ్వగా తీసుకొని ఇంటికి వెళ్లింది. ఇంటికి వెళ్లిన తర్వాత చట్నీ లేకపోవడంతో మరలా టిఫిన్ సెంటర్ వద్దకు వచ్చింది. ఆ సమయంలో గోవిందయ్య బాలిక బుగ్గలు పట్టుకొని అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక ఏడుస్తూ తన తల్లి వద్దకు వెళ్లి జరిగింది చెప్పగా ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాలిక తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు గోవిందయ్యపై పోక్సో చట్టం కింద కేస్ నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న ఆర్‌టిసి బస్సు , బొలెరో

ఇద్దరు వ్యక్తులు మృతి

ప్రజాశక్తి-సంతమాగులూరు

బొలెరో వాహనం, ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన మండల పరిధిలోని పాత మాగులూరు, లక్ష్మీపురం గ్రామాల మధ్య, గుంటూరు, కర్నూలు రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం మల్లవరం గ్రామానికి చెందిన దుగ్గెంపూడి వెంకటేశ్వర రెడ్డి (36), మిర్చి రైతు పొలగట్ల వెంకటేశ్వర్ రెడ్డి (40) మృతిచెందారు. మృతులు గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లి మిరపకాయలను దించి బొలెరో వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. బొలెరో వాహనం పాత మాగులూరు సమీపంలోకి వచ్చేసరికి గుంతకల్లు నుంచి విజయవాడ వెలుతున్న ఆర్‌టిసి లగ్జరీ బస్సును ఎదురుగా ఢీకొంది. దీంతో బొలెరో వాహనం నడుపుతున్న దుగ్గెంపూడి వెంకటేశ్వర రెడ్డి, మిరపకాయల లోడు రైతు పొలగట్ల వెంకటేశ్వర రెడ్డి క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడే మతి చెందారు. బొలెరో వాహనం ముందు భాగం నుజ్జు నుజ్జయ్యింది. ఆర్‌టిసి బస్సు ముందు భాగం కూడా నుజ్జయింది. ప్రమాద సమయంలో ఆర్‌టిసి బస్సులో 13 మంది ప్రయాణికులు ఉన్నారు. వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ నాగ శివారెడ్డి పరిశీలించారు. బొలెరో వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలను ప్రొక్లెయిన్ సహాయంతో బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరస రావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువులకు సమాచారాన్ని అందజేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తులు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్‌టిసి బస్సు

వ్యవసాయ కార్మిక సంఘం జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - సంతనూతలపాడు రూరల్

ఈనెల 15 నుంచి 18 వరకూ కోల్‌కత్తాలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండల పరిధిలోని బి.మాచవరం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం జెండాను బుధవారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించినట్లు తెలిపారు. అందువల్ల పేదలకు పని దినాలు బాగా తగ్గిపోతాయని తెలిపారు. ఫలితంగా గ్రామాల నుంచి వలసలు మళ్లీ పెరిగే అవకాశం ఉందన్నారు. బడ్జెట్‌లో ఆహార భద్రత కూడా నిధులు బాగా తగ్గించారని దీనివల్ల పేదల్లో పోషకాహార లోపం ఎర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూరిమిట్ల వెంగయ్య, పుల్లగూర వెంకట్రావు, అన్నవరపు సుబ్బారాయుడు, దాసరి అంజయ్య, ఆదెమ్మ , ఈశ్వరమ్మ, అంజమ్మ , ఉమా జాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

రేషన్ దుకాణాల్లో తనిఖీ

అవకతవకలకు పాల్పడిన డీలర్లపై కేసు నమోదు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు టోల్ ప్లాజా కేంద్రంగా చౌక బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని, దీనిపై మరింత నిఘా పెంచ నున్నట్లు తహశీల్దారు కె. చిరంజీవి తెలిపారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జేసీ అభిషిక్త్ కిషోర్ ఆదేశాల మేరకు తహశీల్దారు, రెవెన్యూ సిబ్బంది పలు రేషన్ దుకాణాలలో బుధవారం విస్తత తనిఖీలు నిర్వహించారు. మండల పరిధిలోని వాసేపల్లిపాడు రేషన్ దుకాణంలో వారం రోజులుగా చౌక బియ్యం, ఇతర సరుకుల పంపిణీని ప్రారంభించలేదని గుర్తించారు. చౌక బియ్యం మధ్యలోనే దారి మళ్లించి నట్లుగా అధికారులు భావిస్తున్నారు. ఈ విషయంపై సదరు డీలర్‌ను వివరణ కోరగా దుకాణంలో దొంగతనం జరిగినట్లు చెబుతూ తమను పక్కదారి పట్టించేలా డీలర్ వ్యవహారశైలి ఉందని అధికారులు తెలిపారు. రేషన్ డీలర్ పై 6ఎ కేసుతోపాటు క్రమశిక్షణ చర్యల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. అనంతరం టంగుటూరు లోని 2,4,6,8,9 దుకాణాలతో పాటు మండలంలోని ఎం నిడమలూరు లో 31, 33, 48 నెంబర్ల రేషన్ దుకాణాలను పరిశీలించారు. ఆరు దుకాణాలలో అవకతవకలు జరిగినట్లు గుర్తించి 6 కేసులు నమోదు చేసి, సరుకులు సంబంధిత విఆర్ఒల ద్వారా సీజ్ చేసినట్లు తహశీల్దారు తెలిపారు. ప్రజా పంపిణీ బియ్యం సక్రమంగా పంపిణీ చేయని డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విఆర్ఒలు శివకుమార్, కె.శోభారాణి పాల్గొన్నారు.



రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న తహశీల్దారు

బంగారు గొలుసు చోరీకి యత్నం

ప్రజాశక్తి-పర్చూరు

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ చేసేందుకు విఫలయత్నం చేసిన ఘటన పర్చూరు బొమ్మల సెంటర్ బుధవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... స్థానిక బొమ్మల సెంటర్‌లో ఓ మహిళ నడుచుకుంటూ వెళ్తుంది. అదేసమయంలో బైకుపై వచ్చిన ఓ వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసును లాకొన్కేందుకు ప్రయత్నించాడు. విషయాన్ని గమంచిన మహిళ కేకలు వేయటంతో ఆ వ్యక్తి అక్కడ నుంచి పరారీ అయ్యాడు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -శింగరాయకొండ

పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సౌజన్యంతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో తయారు స్టడీ మెటీరియల్‌ను పాకల ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఉచితంగా పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.హరిబాబు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎంతో నైపుణ్యంతో ఈ స్టడీ మెటీరియల్ తయారు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకొని పదవ తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభ కనపరచాలని ఆయన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివాజీ, పాకల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి హరిబాబు, బివి. కష్ణారెడ్డి, కొల్లూరి వెంకయ్య, ఆనంద్ శ్రీనివాసుల రెడ్డి, ప్రతాపరెడ్డి, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డాక్టర్ హరిబాబు



డాక్టర్ మానసను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

డాక్టర్ దేవరకొండ మానసకు సన్మానం

ప్రజాశక్తి-మద్దిపాడు

పేదలకు వైద్యసేవలు అదించేందుకు మద్దిపాడు పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ దేవరకొండ మానస ఎనలేని కృషి చేస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగులు తెలిపారు. ఉత్తమ వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ మానసను విశ్రాంత ఉద్యోగులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ బాలకోటయ్య విశ్రాంత ఉద్యోగులు కాకుమాను సుబ్బారావు. జి. నరసింహారావు, అంజయ్య, సచివాలయ ఎఎన్‌ఎం సుభాషిణి, ఆశా వర్కర్ రత్నకుమారి పాల్గొన్నారు.

విద్యుత్ అధికారిపై దాడి

ప్రజాశక్తి-అద్దంకి

విద్యుత్ డిఇ ఆదేశాల మేరకు డివిజన్ రైట్స్‌లో భాగంగా కొమ్మాలపాడు విద్యుత్ లైన్‌ఇస్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు లైన్‌మ్యాన్‌తో కలిసి మండల పరిధిలోని కలవకూరు గ్రామంలో విద్యుత్ మీటర్ రీడింగ్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ ఉప సర్పంచి ఆదిరెడ్డి ఇంటికి వెళ్లి మీటర్‌లో రీడింగ్ తీస్తుండగా అధికారులు, సిబ్బందిని దుర్భాలాడాడు. ఎన్నిసార్లు రీడింగ్‌లు తీస్తారంటూ కర్రతో దాడి చేశారు. ఈ దాడిలో విద్యుత్ అధికారికి గాయాలయ్యాయి. బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విద్యుత్ అధికారి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఘర్షణ పడుతున్న మహిళలు

తోపుడు బండ్ల ఏర్పాటు కోసం మహిళల సిగపట్లు

ప్రజాశక్తి- అద్దంకి

కూరగాయల బండ్లు ఏర్పాటు చేసుకునే విషయంలో ఇద్దరు మహిళలు జుట్లు జట్లు పట్టుకొని కొట్టుకున్న ఘటన అద్దంకి పట్టణంలోని బంగ్లారోడ్‌లో బుధవారం చోటుచేసుకుంది. బంగ్లారోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఇద్దరు మహిళలు తోపుడు బండ్లపై కూరగాయలు అమ్ముతుంటారు. ఈ క్రమంలో కూరగాయలు బండ్లు ఏర్పాటు చేసుకొని విషయంలో మనస్పర్ధలు ఏర్పడ్డాయి. చివరకూ విషయం గాలి వానగా మారింది. ఒకరినొకరు దూషించుకున్నారు. మాట మాట పెరిగి జుట్లు పట్టుకొని నడిరోడ్డుపై కలబడ్డారు. స్థానికులు తప్పించేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ లెక్క చేయకుండా ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. చివరకూ విషయం తెలుసుకున్న పోలీసులు బంగ్లా రోడ్డు వెళ్లి అంబేద్కర్ విగ్రహం వద్ద తోపుడు బండ్ల మీద కూరగాయలు అమ్ముకుంటున్న వ్యాపారులతో మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహం వద్ద తోపుడు బండ్లు పెట్టవద్దని హెచ్చరించి పంపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నొంగనోట్లు

దొంగనోట్ల హల్‌చల్

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండల పరిధిలోని హనుమాన్‌జంక్షన్ (కుంట)లో ఇద్దరు వ్యక్తులు షాపులలో రూ.500 నకిలీ నోట్లు మారుస్తుండగా షాపు యజమానికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నిందితులను అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నారు. వారి వద్ద నుంచి రూ.40వేల విలువైన నకిలీ నోట్లును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో దొంగనోట్లు ఎక్కడ నుంచి వచ్చాయనే విషయం తేలనుంది.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తాము కృషి చేస్తున్నట్లు బాపట్ల జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లు, ఇతర విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది మరియు ఇటీవల గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి బాపట్ల జిల్లాకు వచ్చిన సిబ్బంది కలిపి మొత్తం 75 మంది గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. తమ వ్యక్తిగత సమస్యలు, కుటుంబ సభ్యుల ఆరోగ్యపరమైన సమస్యల కారణంగా బదిలీలు, ఇతర సమస్యలు గురించి ఎస్‌పి వినతి పత్రాలు ఇచ్చారు. ఎస్‌పి సిబ్బంది సమస్యలను కూలంకుషంగా విన్నారు. వారి విన్నపాన్ని పరిశీలించి సానుకూలంగా స్పందించారు. అవకాశం ఉన్న వాటికి సత్వర పరిష్కారం చూపించారు. ఇతర సమస్యల గురించి డిపిఒ అధికారులతో మాట్లాడి ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని ఆదేశించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నెలలో ఒకరోజు గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ డిఎస్పి ఎ. శ్రీనివాస్, డిపిఒ ఎ సెక్షన్ సూపరింటెండెంట్ షేక్ కరీముల్లా ఖాసిం, మరియు డిపిఒ , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి

21న కథా రచనల పోటీలు

ప్రజాశక్తి-బాపట్ల

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఉభయ రాష్ట్రాల స్థాయిలో కథా రచన పోటీలు బాపట్ల జిల్లా రచయితల సంఘం సౌజన్యంతో ఈ నెల 21న నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు తిమ్మన శ్యామసుందర్, నందిరాజు విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఏర్పాటు నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. అంతర్జాతీయ మాతభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషనే స్మరిద్దాం- తెలుగు దనంలో స్వరిద్దాం అనే స్ఫూర్తితో లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల, రసరంజని, రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల ఆధ్వర్యంలో పట్టణంలోని రోటరీ కల్యాణ మండపంలో ఈ కథా రచన పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు గంట ముందు అంశం ప్రకటిస్తారని తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ , తతీయ బహుమతులుగా రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. ప్రోత్సాహక బహుమతులుగా ముగ్గురికి ఒక్కొక్కరికి రూ 1వెయ్యి చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొన్న ప్రతి రచయితకు ఈ ప్రశంశా పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. పోటీ అనంతరం ఫలితాలు ప్రకటించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కథా రచనల పోటీలకు ముందు రసరంజని సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పుస్తక ప్రియులు ఈ పుస్తకాలను ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. జీవన నైపుణ్యాలు – జీవన ప్రగతి నిర్మాణం, వ్యక్తిత్వ వికాస అంశంపై రామకష్ణ సేవా సమితి కార్యదర్శి అమిరపు నటరాజన్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో రసరంజని అధ్యక్షుడు బూర్గుల సంగమేశ్వర శాస్త్రి, లయన్ అలవర్తి శ్రీనివాస రావు, రోటేరియన్ ఎం.సుధీర్ కుమార్, పోలాసం వీరాంజనేయులు, అన్నం పూర్ణచంద్ర రావు, జివి, షేక్ బాబా వలి, మేకల రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రకాశరావు

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- చీరాల

ఐఐటి జెఇఇ మెయిన్స్‌లో చీరాలలోని శ్రీవిద్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ప్రకాశరావు మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతున్న ఆర్. భరత్ భూషణ్ జాతీయస్థాయిలో 98.65 ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. నీరజ్ 97.7, ఢిల్లీరామ్ విగ్నేష్ 95.39, పి.అభిషేక్ 92.65, బి.ఇంద్ర వర్ధన్ 92.44 ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపిపి

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి -భట్టిప్రోలు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న నాలుగు వాలంటీర్ల పోస్టు భర్తీ చేశారు. వాలంటీరు పోస్టులకు ఎంపికైన వారికి ఎంపిపి డివి. లలితకుమారి చేతులమీదుగా బుధవారం నియామక పత్రాలు అందజేశారు.ఐలవరం 1,2 సచివాలయ పరిధిలో రెండు, ఓలేరు 1, ఆళ్ళమూడిలో ఒక వాలంటీరు పోస్టును భర్తీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్ర శేఖర్,ఎంపిటిసిలు నన్నెపాముల చంటి,మురుగుడు శ్రీనివాసరావు,సురేపల్లి పిఎసిఎస్ చైర్మన్ గోవర్ధనగిరి, శేషాచల శ్రీనివాసరావు, నాయకులు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

3,4 తేదీల్లో బిఇసిలో బెక్తగాన్-2023

ప్రజాశక్తి బాపట్ల

ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నిబిడీకతమైన సజనాత్మక శక్తిని వెలికి తీసి వారిలో ఆత్మ విశ్వాసాన్ని మరింత పెంపొందించేందుకు బెక్తగాన్ లాంటి పోటీల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు తెలిపారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మార్చి3, 4 తేదీల్లో జాతీయస్థాయిలో నిర్వహించనున్న సాంకేతిక ,సాంస్కతిక, వ్యాసరచన, క్రీడల పోటీలు బెక్తగాన్ 2023కు సంబంధించిన పోస్టర్‌ను ఎడ్యుకేషన్ సొసైటీ పాలకవర్గ సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివద్ధికి దోహదపడే ఈ విధమైన విలక్షణ కార్యక్రమాలను నిర్వహించడంలో రాష్ట్రంలో అత్యుత్తమ సాంకేతిక విద్యా కేంద్రంగా భాసిల్లుతున్న బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా బెక్తగాన్ – 2023 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో ప్రిన్సిపల్ షేక్ నజీర్, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు దొప్పలపూడి రామమోహనరావు, గెల్లి దిలీప్ కుమార్, సంయుక్త కార్యదర్శి కొమ్మినేని హరి పద్మ ప్రసాద్ ,కోశాధికారి తాళ్లూరి రామకష్ణ, బి.రత్న సునీల్, ఎ. రామ్మోహన రావు, షేక్ షఫ్ రీన సుల్తాన్, వై.అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎడ్యుకేషన్ సొసైటీ పాలక వర్గ సభ్యులు



శైలజను సన్మానిస్తున్న మన్మధరావు

చీరాల విద్యార్థినికి బంగారు పతకం

చీరాల: బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియంలో ఇటీవల జూనియర్ నేషనల్ ఇండియా టైక్వాండో జూనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చీరాలకు చెందిన విద్యార్థిని శైలజ బంగారు పతకం సాధించింది. ఈసందర్భంగా టైక్వాండో ప్రెసిడెంట్ శ్రీనివాసరావు మాట్లా డుతూ ఆంధ్రప్రదేశ్‌కి చెందిన శైలజ మహిళా విభాగం 63 కిలోల పోటీల్లో బంగారు పతక సాధించినట్లు తెలిపారు. బంగారు పతకం సాధించిన శైలజకు బాపట్ల జిల్లా రిజర్వు ఇన్‌స్పెక్టర్ మన్మధరావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి టైక్వాండో సిఇఒకష్ణ, ఎపి టైక్వాండో ఇన్‌ఛార్జి వెంకటేశ్వర రావు, ప్రకాశం జిల్లా టైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ మంత్రి శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌ఛార్జ్ పి.సుబ్రమణ్యం, జిల్లా కోచ్ మల్లెల సురేష్, కోచ్ జి. శాంతి, వర్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కరణం వెంకటేష్‌బాబు

ప్రజాశక్తి - చీరాల

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలని లక్ష్యంతో ఎపి నైపుణ్య అభివద్ధి సంస్థ, సిడాప్ మరియు ఉపాధి కల్పన సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17న చీరాల ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ నిర్వహిస్తున్న జాబు మేళాకు నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కరణం వెంకటేష్ బాబు తెలిపారు. స్థానిక బాలుర హైస్కూల్ ప్రాంగణంలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఘంటా సుధాకర్, ఉపాధి కల్పన జూనియర్ అధికారి రమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎపి నైపుణ్యాభివద్ధి సంస్థ నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి ఎంతగానో కషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు సుమారు 20కిపైగా ప్రముఖ బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యా అర్హతను బట్టి జీతం సుమారు రూ.12,500 నుంచి రూ. 25 వేల వరకూ ఉండవచ్చని తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బిటెక్ డిప్లమా, ఫార్మసీ, పీజీ పూర్తి చేసిన వారు జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ బయోడేటా, ఎడ్యుకేషన్ ధవీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు నేరుగా హాజరు కావచ్చునని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9346280289, 8555901198 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బాబు,కౌన్సిలర్లు, అధికారులు, కో ఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణం వెంకటేష్

ఏరియా వైద్యశాలలో విజిలెన్స్ తనిఖీలు

వైద్య సేవలపై ఆరా తీసిన అధికారులు

ప్రజాశక్తి - చీరాల

చీరాల ఏరియా వైద్యశాలలో వైద్యుల విధులు, వారు అందిస్తున్న సేవలు గురించి బుధవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లోని సౌకర్యాలు, సదుపాయాలు, మందులు ఇతర అంశాలపై పరిశీలించారు. మందులు, వైద్యపరికరాలు, శస్త్ర చికిత్సకు సంబంధించిన వస్తువులు, ల్యాబ్ కిట్లు,మరుగుదొడ్ల గురించి అధికారులు తెలుసుకున్నారు. రోగులను అడిగి వైద్య సేవల గురించి ఆరాతీశారు. పలు కీలక దస్త్రాలను పరిశీలించి వివరాలను నమోదుచేసుకున్నారు. ఆసుపత్రికి కావాల్సిన మౌళిక వసతులను నమోదుచేసుకున్నారు. ఈ సందర్భంగా గుంటూరు విజిలెన్స్ సిఐ శ్రీహరిరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆసుపత్రుల్లో తాము తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అంద జేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తనిఖీల్లో విజిలెన్స్ ఎఇ నాగేశ్వరరావు, ఎస్ఆర్ఒ షేక్ సైదులు, ఈపూరుపాలెం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధాకష్ణ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషు కుమార్, ఎఫ్ఆర్ఒ డాక్టర్ సుభాషిణి, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆనందం అయ్యవార్ల సేవలు మరువలేనివి

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-సిఎస్.పురం

మారుమూల ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన ఆనందం నవమణి అయ్యవార్ల సేవలు మరువలేనివని కలెక్టర్ ఏ.యస్.దినేష్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని అరివేముల గ్రామంలో ఆనందం నవమణి అయ్యవార్ల 20వ సంస్మరణ సభ విశ్రాంత స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎ.విద్యాసాగర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా ఆనందం నవమణి అయ్యవార్ల విగ్రహాలకు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో కలెక్టర్ మాట్లాడారు. 1940వ సంవత్సరంలో అరివేముల గ్రామంలో పాఠశాలను స్థాపించి విద్యాభివృద్ధికి నడుంబిగించిన మహనీయుడు అని కొనియాడారు. ఆనందం నవమణి జ్ఞాపకార్థం కుటుంబీకులు ముద్రించిన సాకారమైన స్వప్నం అనే పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత చీఫ్ సెక్రటరీ విద్యాసాగర్, ఎమ్మెల్యే బుర్రామధుసూదన్ యాదవ్, అనంతరం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పదవతరగతి మెరిట్ సాధించిన విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్‌డిఓ కె.సందీప్ కుమార్, గ్రామ సర్పంచ్ యస్.రాధారుక్మిణమ్మ, మెప్మా అధికారి టి.రవికుమార్, సెర్ప్ డిపియం కత్తికళ్యాణ్, ఎంపిడిఓ ఈశ్వరమ్మ, యంఇఓ జె.ప్రసాదరావు, ఆర్‌డబ్ల్యూయస్ ఎఇ రాజేష్, ట్రస్ట్ సియిఓ ఆల్బర్ట్, పటేల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

హత్య కేసులో భార్యకు జీవితఖైదు

ప్రజాశక్తి-మార్కాపురం

భర్తను... భార్య హత్య చేసిన కేసులో నిందితురాలైన భార్యకు జీవిత ఖైదును విధిస్తూ మార్కాపురంలోని ఆరవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి టి.రాజా వెంకటాద్రి బుధవారం తీర్పును వెల్లడించారు. వివరాల ప్రకారం... 2016 డిసెంబరు 21వ తేదీ అర్ధరాత్రి సమయంలో సయ్యద్ ఖాదర్‌బాషాను ఆయన భార్య సయ్యద్ మస్తాన్‌బి హతమార్చింది. తన భార్య మస్తాన్‌బి ఇతరులతో ఫోన్‌లో మాట్లాడటాన్ని భర్త ఖాదర్‌బాషా సహించలేకపోయాడు. ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించాడు. మద్యం తాగి వచ్చిన ఖాదర్‌బాషా మరోమారు మందలించాడు. దీంతో భర్త ఖాదర్‌బాషాపై ఆక్రోశం పెంచుకుంది. పైన ఉదహరించిన తేదీన భర్త ఖాదర్‌బాషా నిద్రమత్తులోకి జారుకోగా ఆయన భార్య మస్తాన్‌బి బ్లేడుతో చేతులు, మెడ భాగంలో కోసి హత్య చేసింది. ఖాదర్‌బాషా మార్కాపురం చెందిన వ్యక్తి కాగా... దర్శిలో నివాసం ఏర్పరచుకున్నారు. ఈ ఘటన దర్శిలో జరిగింది. దర్శి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితురాలైన భార్య మస్తాన్‌బిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను విచారించిన ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి టి.రాజా వెంకటాద్రి నేరం రుజువు కావడంతో సయ్యద్ మస్తాన్‌బికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు. బాధితుల తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల క్రిష్టారావు వాదించారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

సచివాలయంలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-సిఎస్.పురం

స్థానిక అరివేముల గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఏ.యస్.దినేష్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సచివాలయంలో పరిధిలో జరుగుతున్న భూముల రీసర్వే గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవకతవకలు లేకుండా త్వరితగతిన రీసర్వే పూర్తిచేసి హద్దు రాళ్లు వేయాలని అన్నారు. ఇంటినివేశన స్థలాల గురించి వివరణ అడగ్గా గ్రామంలో ప్రభుత్వభూమి లేనందువల్ల మండల కేంద్రంలో కేటాయించినట్లు సిబ్బంది తెలిపారు.



మాట్లాడుతున్న పిచ్చయ్య

బడ్జెట్‌లో నిరుద్యోగులకు మొండిచెయ్యి

ప్రజాశక్తి-దరిశి

కేంద్ర బడ్జెట్‌లో నిరుద్యోగులకు మొండిచెయ్యి చూపారని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కెవి పిచ్చయ్య అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని చెప్పి ఈ బడ్జెట్‌లో ఏమీ కేటాయించకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్ సంస్థలయిన ఆదానీ, అంబానీలకు లక్షల కోట్లు రాయితీలిచ్చి నిరుద్యోగులకు అన్యాయం చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు కోటిరెడ్డి, జెస్సీపాల్ పాల్గొన్నారు.

ఘనంగా 'ఉగ్ర' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కనిగిరి


టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి జన్మదిన వేడుకలను కనిగిరి అమరావతి గ్రౌండ్‌లో టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. 50 అడుగుల భారీ కటౌట్‌కు 50 లీటర్లతో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం 50 కేజీల కేకును కట్ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాచమళ్ల శ్రీనివాసరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, షేక్ ఫిరోజ్, చింతలపూడి తిరుపాలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: రాబోయే 2024 శాసనసభ ఎన్నికల్లో కనిగిరి గడ్డమీద తెలుగుదేశం జెండాను ఎగురవేయాలని, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొనే బాధ్యత మనందరిపై ఉందని తెలుగుదేశం పార్టీ హనుమంతునిపాడు మండల అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి సూచించారు. ముక్కు ఉగ్రనరసింహారెడ్డి 50వ పుట్టినరోజు సందర్భంగా హనుమంతునిపాడు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అన్ని మత ప్రార్థనల మధ్య పుట్టినరోజులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డెం తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, మురహరి నరసయ్య, గంటా శ్రీనివాసరెడ్డి, గంజి రమేష్‌రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎర్రయ్య, రఘునాథ కాశిరెడ్డి, బ్రహ్మంగౌడ్, కూడాలి దశరథ, మువ్వా రంగసాయి పాల్గొన్నారు.



హనుమంతునిపాడులో..

50 అడుగుల కటౌట్‌కు పాలాభిషేకం



కనిగిరిలో..

పామూరు: పామూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉగ్రనరసింహారెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పామూరు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పిటిసిలు బొల్లా మాల్యాద్రి చౌదరి, మోరబోయిన హుస్సేన్‌రావు పాల్గొన్నారు.

వెలిగండ్ల: ముక్కు ఉగ్రనరసింహారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి, టిడిపి సీనియర్ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి దంపతులు ఉగ్రనరసింహారెడ్డిని హైదరాబాద్‌లో బుధవారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా వేడుకలు

డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పుట్టినరోజు వేడుకలు నాయకులు, కార్యకర్తల మధ్య వెలిగండ్ల మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గం రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్ రెడ్డి, మండల రైతు అధ్యక్షుడు మీనిగ కాశయ్య పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

గర్భిణుల ఆరోగ్య పరిస్థితి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి సూచించారు. బుధవారం ఆమె కొర్రపోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నపిల్లలకు ఇవ్వవలసిన టీకాలను క్రమం తప్పకుండా వేయాలన్నారు. ఆసుపత్రిలోని మందుల రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.శంకర్‌రెడ్డి, డాక్టర్ టి. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా భక్తులు సహకరించాలి: సిఐ

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 11 నుండి 18వ తేదీ వరకు శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, ఈ బ్రహ్మోత్సవాలు భక్తులు అధిక సంఖ్యలో వస్తారు కాబట్టి ప్రమాదాలు జరగకుండా సహకరించాలని యర్రగొండపాలెం సిఐ మారుతీకృష్ణ కోరారు. బుధవారం ఆయన దోర్నాలలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దోర్నాల నుండి శ్రీశైలం వరకు గల ఘాట్ రోడ్డులో ఎట్టి పరిస్థితులలోనూ వాహనాలు ఆపరాదన్నారు. కార్యక్రమంలో దోర్నాల ఎస్ఐ విశ్వేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్డీఎఫ్ ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి-చీమకుర్తి

ఆర్డీఎఫ్ ఆధ్వర్యంలో పలువురికి ఆపరేషన్ల నిమిత్తం రక్తదానం చేశారు. స్థానిక జవహర్ నర్సింగ్‌హోంలో ఆపరేషను చేయించుకుంటున్న పొదిలి మండలానికి చెందిన ఎండ్లూరి సుకన్య, దర్శి మండలానికి చెందిన మందారాజెమ్మకు రక్తదానం చేశారు. హైదరాబాద్ స్టార్ ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ కోసం అద్దంకి చెందిన మస్తాన్‌వలికి తెలంగాణా ఆర్డీఎఫ్ కన్వీనర్ వంశీ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఎఫ్ వ్యవస్థాపకులు ఇస్తర్ల శంకర్ మాట్లాడుతూ తలసేమియా, డయాలసిస్ పేషెంట్లు, గర్భిణులు రక్తం అవసరమైతే ముందుగా తమను ఫోను ద్వారా సంప్రదిస్తే, ఉచితంగా రక్తదానం చేస్తామన్నారు. అత్యవసరంగా ఎవరికి రక్తం అవసరమైనా తమను సంప్రదించాలన్నారు. 9666930929, 9652306929 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని చెప్పారు.

అటవీ సంపదకు కాపాడాలి..

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అటవీ సంపదన కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హైకోర్టు న్యాయవాది తిరుపతి తెలిపారు. బుధవారం ఆయన దోర్నాలలో మార్కాపురం డివిజన్ పరిధిలోని అటవీశాఖ అధికారులకు అటవీ చట్టాలపై అవగాహన కల్పించారు. అటవీ జంతువులను వేటాడిన వారిపై తీసుకోవాల్సిన సెక్షన్లను వివరించారు. ప్రతి ఒక్కరూ అటవీ జంతువులను కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో దోర్నాల రేంజర్ విశ్వేశ్వరరావుతో పాటు అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

గృహసారథులకు శిక్షణ

ప్రజాశక్తి-పామూరు

స్థానిక సత్యనారాయణ ఫంక్షన్‌హాల్‌లో వైసిపి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కనిగిరి శాసనసభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొని ముఖ్య సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎఫ్ఎ-3 పరీక్ష తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నుండి జరుగుతున్న ఎఫ్ఎ 3 పరీక్షను మండల విద్యా శాఖాధికారి పి ఆంజనేయులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శంకర్, రవి పాల్గొన్నారు. అనంతరం ఇక్కడే ఉన్న ఆధార్ కేంద్రాన్ని సందర్శించి.. కాంప్లెక్స్ పరిధిలోని విద్యార్థులందరూ ఆధార్ చేయించుకునేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని తెలిపారు. 100 శాతం పూర్తి చెయ్యాలని ఆదేశించారు.

జగన్‌ని ఇంటికి పంపాల్సిందే..: టిడిపి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజలపై భారాలు మోపుతున్న జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాల్సిందేనని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. బుధవారం టిడిపి ఆధ్వర్యంలో యర్రగొండపాలెం పట్టణంలోని గోళ్ళ వారి బజార్, అమ్మవారి శాల వీధి, యక్కలి వారి వీధులలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రజలకు జగన్ రెడ్డి చేస్తున్న మోసాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్య క్రమంలో యర్రగొండపాలెం పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, నాయకులు చేకూరి సుబ్బారావు, పట్టణ తెదేపా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, మంత్రునాయక్ పాల్గొన్నారు.

కనిగిరి డిఎల్‌పిఓగా శోభన్‌బాబు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి డిఎల్‌పిఓగా దర్శి ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న గుత్తా శోభన్‌బాబును కలెక్టర్ దినేష్‌కుమార్ నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు అందుకున్న ఆయన బుధవారం ఉదయం కనిగిరి డిఎల్‌పిఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రామధుసూదన్‌యాదవ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కనిగిరి ఈవోపీఆర్డీ ఓ అన్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

సాంస్కృతిక కళా విభాగం జిల్లా ఇన్‌ఛార్జిగా 'ప్రతిమ సునీల్'

ప్రజాశక్తి-మార్కాపురం



ప్రతిమ సునీల్

ప్రకాశం జిల్లా సాంస్కృతిక కళా విభాగం ఇన్‌ఛార్జిగా మార్కాపురం పట్టణానికి చెందిన ప్రతిమ సునీల్ నియమితులయ్యారు. ప్రతిమ సునీల్ మార్కాపురం పట్టణంలో న్యాయవాదిగా, స్నేహ సంగీత నాట్య కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. గత 20 ఏళ్ల నుండి జిల్లాలో సాంప్రదాయ సాంస్కృతిక కళాభివృద్ధికి కృషి చేస్తున్నారు. సంగీత నాట్య కళాశాల నిర్వహణతో పాటు మహిళలకు, పేద ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు ఇస్తున్నారు. ప్రజా సంకల్ప వేదిక ఆధ్వర్యంలో జిల్లాలోని విద్యార్థులకు సాంప్రదాయ సాంస్కృతిక కళాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు సాంస్కృతిక కళాభిమానులు సూచిస్తున్నారు.



పెయింట్ దుకాణంలో వ్యాపించిన మంటలు

మార్కాపురంలో ఘోర అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక శివాలయం బజారులోని టీఎస్ పెయింట్ అండ్ హార్డ్వేర్ షాప్ నందు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద అగ్ని ప్రమాదం సంబంధించినది. షాప్ యజమాని సుబ్రమణ్యం ప్రతిరోజు లాగే ఈరోజు కూడా వ్యాపారం ముగించుకుని షాపు తాళం వేసుకొని ఇంటికి వెళ్లారు. ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా బిల్డింగ్ నుండి పెద్ద ఎత్తున మంటలు చాలా రేగుతుండడాన్ని స్థానికులు గమనించి షాపు యజమాని సుబ్రహ్మణ్యం కు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది స్థానిక పోలీసులు సంయుక్తంగా మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. హార్డ్వేర్, పెయింట్ ఉండడంతో ఐదంతస్తుల మేర ఉన్న బిల్డింగు మంటలు పూర్తిస్థాయిలో వ్యాపించాయి. షాపు నందు 25 లక్షల మేరకు సరుకు, బిల్డింగ్ కోటిన్నర వరకు ఉంటుందని షాపు యజమాని సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కమిషనర్‌కు కాలనీవాసుల వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

తమ ప్రాంతానికి వారానికోసారి తాగునీరు సరఫరా అవుతోందని, దోమలు విపరీతంగా ఉన్నాయని, ఇంటిపన్నులు వేయాలని స్థానిక 50వ డివిజన్ పరిధిలోని జయప్రకాష్‌కానీ ఎక్స్‌టెన్షన్, నేతాజీ కాలనీ ప్రజలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావుకు విన్నవించారు. ఆయా కాలనీలలో కమిషనర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను కమిషనర్‌కు వివరించారు. ప్రధానంగా వారానికోసారి తాగునీరు సరఫరా చేస్తున్నందున తాగునీటికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని, నాలుగు రోజులకోసారి తాగునీరు అందించాలని సంబంధిత అధికారులను కమిషనర్ వెంటనే ఆదేశించారు. కాలనీలలో పిచ్చిమొక్కలు తొలగించాలని సిబ్బందికి సూచించారు. డ్రమ్ముల్లో, తొట్లలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటిపన్నులు వేసేందుకు గాను రెవిన్యూ ఇన్స్‌పెక్టర్‌తో చర్చించారు. సూపర్ స్ట్రక్చర్ టాక్స్ వేయాలని ఆదేశించారు. నేతాజీ కాలనీలో రోడ్డు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ ప్రసాదరావు ఉన్నారు.

మహిళా మార్ట్‌లో

వ్యాపారం ఆశాజనకంగా లేదు..

డిఆర్‌డిఎ పీడీ బాబూరావు

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేయూత మహిళా మార్ట్‌లో వ్యాపారం ఆశాజనకంగా లేదని, విక్రయాలు పెంచేందుకు మహిళలందరూ సమిష్టిగా కషి చేయాలని జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బడుగు బాబూరావు సూచించారు. బుధవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రభుత్వ పథకాల అమలు తీరు, మహిళల ఆర్థికాభివద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కషిని ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో విఓఏలతో ఆయా గ్రామాల వారీగా పీడీ సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ బాబూరావు మాట్లాడుతూ చేయూత మహిళామార్ట్‌లో గ్రామ సంఘాల మహిళలకు తక్కువ ధరకే వస్తువులు విక్రయించేలా ప్రయత్నం చేయాలని, వస్తువులన్నీ క్రమపద్ధతిలో ఇతరులను సైతం ఆకర్షించేలా మార్ట్‌ను తయారు చేయాలన్నారు. మండలానికి గొర్రెలు, మేకల యూనిట్లు 50 ఉండాలని, గేదెల యూనిట్లు కూడా 30 మందికి తగ్గకుండా ఇవ్వాలని చెప్పారు. సచివాలయం పరిధిలో ఒక ఫిష్ ఆంధ్ర



మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ బాబూరావు

దుకాణం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న పాలవెల్లువ, జగనన్న తోడు, జగనన్న లే అవుట్ల గహ నిర్మాణాలపై ప్రత్యేక దష్టితో పనిచేయాలని పీడీ బాబురావు సీసీలు, విఓఏలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.అజిత, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.సనిత, ఏరియా కోఆర్డినేటర్ గుంజి రాంబాబు, ఏపీఎం గంటా శ్రీనివాసరావు, వెలుగు సీసీలు మేడా వెంకట్రావు, కె చిన్నరాజు, చోడాబత్తిన గోవిందమ్మ, సీహెచ్ కవిత, కె పద్మజ, పలు గ్రామాల వీఓఏ లు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీల్లోనే కవర్ల తయారీ ఆపేయాలి

సమావేశంలో చిరువ్యాపారుల వినతి

ప్రజాశక్తి-దొనకొండ

ఫ్యాక్టరీల్లోనే ప్లాస్టిక్ కవర్ల తయారీని ఆపేయాలని, పందులు, కుక్కలు, కోతులను నివారించేందుకు వేయని జరిమానా కవర్లు వాడే చిరువ్యాపారం చేసుకునే వారికి వేయటం సరికాదని పలువురు చిరువ్యాపారులు వాపోయారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి అధ్యక్షతన ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై వ్యాపారులతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకంపై నిషేధం అమలులో ఉందన్నారు. సరుకులు ప్లాస్టిక్ కవర్లలో అమ్మిన వారికి రూ.1000, కొన్నవారికి రూ.500 జరిమానా విధిస్తామన్నారు. ఇప్పటికే 18 మందికి జరిమానా వేశామన్నారు. చిరువ్యాపారులు మాట్లాడుతూ గుడ్డ సంచులు అందుబాటులో లేవని, మరో 10 రోజులు గడువు పెంచాలని కోరారు. స్పందించిన కార్యదర్శి క్రిష్ణమూర్తి మాట్లాడుతూ 2021లోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ కవర్ల కంపెనీలపై నిషేధం చేసిందని, దొంగచాటుగా అమ్ముతున్న కంపెనీలను అరికట్టేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, వార్డు సభ్యులు కె.రామారావు, ముజాయిద్, బత్తుల వెంకటసుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి

ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలు బాగుండాలని పాలన సాగిస్తున్నారని, అర్హత కలిగిన ఏ ఒక్కరికీ ప్రభుత్వం ద్వారా అన్యాయం జరగకూడదనే సంకల్పంతో పనిచేస్తున్నారని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. అందరూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. బుధవారం స్థానిక డ్వాక్రా బజారులో జరిగిన గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వాలంటీర్ల వ్యవస్థ బాగుందన్నారు. ఎవరికి ఎలాంటి పథకం వర్తిస్తుందో గుర్తించి ఎంపిక చేయడం జరుగుతోందన్నారు. వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉండీ సంక్షేమానికి నోచుకోని వారందరినీ గుర్తించేందుకు వాలంటీర్లతో పాటు గృహ సారథులను కొత్తగా నియమించడం జరిగిందన్నారు. వాలంటీర్లతో కలిసి పనిచేసి మీకు అప్పగించిన గృహాల్లో ఎవరికి ఏ పథకం వర్తిస్తుందో గుర్తించాలన్నారు. ఆ విధంగా ప్రభుత్వం ద్వారా సాయం అందించేందుకు మనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

పనిచేయాలన్నారు. వాలంటీర్లతో పాటు గృహ సారథులు సంయుక్తంగా పనిచేసి జగనన్న ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సిఎం జగన్ అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు హబిబుల్లా, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దర్శి ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే..

80 వేల మెజార్టీతో గెలుస్తా..

వైసిపి నేత ఆవుల వెంకటరెడ్డి

ప్రజాశక్తి-కురిచేడు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దర్శి నియోజకవర్గం నుండి స్థానికుడిగా తనకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి ఒక అవకాశం ఇస్తే 80 వేల ఓట్లతో గెలిచి ఆయనకు బహుమతిగా ఇస్తానని వైసిపి మండల నాయకులు ఆవుల వెంకటరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాయం ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను 38 సంవత్సరాలుగా రాజకీయాలలో ఉంటూ అనేక పదవులలో పనిచేశానన్నారు. మొదట్లో టిడిపికి తరువాత వైసిపికి తన శక్తివంచన లేకుండా పని చేసి స్థానికేతరులుగా ఉన్న ఎందరినో ఎమ్మెల్యేలుగా గెలిపించేందుకు చాకిరీ చేశామన్నారు. ఈ నియోజకవర్గంలో స్థానికేతరులు ఎమ్మెల్యేగా వచ్చి ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటుకు రూ.1500 ఇచ్చి సుమారు రూ.400 కోట్లకు సంపాదించుకునే ఎమ్మెల్యేల పరిస్థితి రాష్ట్రమంతా ఉందన్నారు. ఇటీవల ఎమ్మెల్యే చేస్తున్న కార్యక్రమాలకు ఆయన తనను పిలవకపోవడం వారి దురదృష్టమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కేశనపల్లి క్రిష్టయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆవుల వెంకటరెడ్డి

వ్యాధి నిరోధక టీకాల పరిశీలన

ప్రజాశక్తి-దొనకొండ

స్థానిక సచివాలయం, గంగదేవిపల్లి సచివాలయాల్లో సిబ్బంది అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలను జిల్లా వ్యాధి నిరోధక అధికారి పి.పద్మజ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలకు, ఏడాదిలోపు చిన్నారులకు టీకాలు ప్రతి బుధ, గురువారాల్లో అందించాలన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని టీకాలు నిల్వలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించి.. ఇక్కడి తాగునీటి వల్ల సమస్యలు వస్తున్నాయని, పూర్తిగా మినరల్ వాటర్ వాడాలని పాఠశాల సిబ్బందికి పద్మజ సూచించారు. ఆమె వెంట వైద్యురాలు కె.సునీత, సీహెచ్ఓ ఇన్యాసమ్మ, హెచ్ఈఓ కె.చంద్రశేఖరబాబు, సూపర్‌వైజర్ ప్రభావతిదేవి, ఏఎన్ఎంలు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి

గోవర్ధన్‌కు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండలంలోని దావగూడూరు గ్రామంలో బోడపాటి గోవర్ధన్ దశదిన ఖర్మ బుధవారం జరిగింది. కార్యక్రమానికి కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, జరుగుమల్లి మాజీ జడ్పీటిసి దామచర్ల పూర్ణచంద్రరావు హాజరై.. గోవర్ధన్‌కి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చదలవడ బ్రహ్మేంద్రం, నరసింహారావు, దామచర్ల శ్రీను, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు

ఉత్తమ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-అర్ధవీడు

మండలంలో పలు శాఖలకు సంబంధించి.. ఉత్తమ అవార్డులు పొందిన ప్రభుత్వ అధికారులకు స్థానిక తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ మేడూరి వెంకట్రావు హాజరయ్యారు. గత కొన్ని రోజుల క్రితం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ద్వారా ప్రశంసాపత్రాలు అందుకున్న వారికి మండల ప్రజలు అభినందించారు. మండల కోఆప్షన్ నెంబర్ షేక్ జిలానీ, రఘు, మాజీ ఎంపీడీవో బషీర్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.రవిబాబు, సర్పంచ్ వసంత పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అత్యవసర విమాన ల్యాండింగ్, రైల్ ఓవర్ బ్రిడ్జి, సర్వీసు రోడ్డు ఏర్పాట్లపై డిల్లీలో కేంద్ర, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ గిద్దలూరులో రాచర్ల రైల్వే గేటు వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒఆర్ఒబికి సిఆర్ఐయఫ్ నిధులు మంజూరు చేయాలని కోరారు. సి.ఎస్. పురం మండలం అంబవరం గ్రామం వద్ద ఉన్న శ్రీ భైరవేస్వరస్వామి దేవస్థానానికి వెళ్లేందుకు భక్తులు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే నుంచి దేవస్థానం వరకు 3 కిలోమీటర్ల సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. చిలకలూరిపేట – నెల్లూరు సెక్షన్ లో శింగరాయకొండ వద్ద నిర్మాణంలోనున్న ఎమర్జెన్సీ లాండింగ్ ఫెసిలిటీ కి సంబంధించి మైనర్ బెండ్స్ (చిన్న వంకలు), కర్వ్ (మలుపు)లను సరిచేసి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి రైల్ ఓవర్ బ్రిడ్జికి సిఆర్ఐఎఫ్ నిధులు మంజూరుకు, బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే నుంచి శ్రీ భైరవేస్వరస్వామి దేవస్థానం వరకూ మూడు కిలోమీటర్ల సర్వీసు రోడ్డు ఏర్పాటుకు, శింగరాయకొండ వద్ద ఎమర్జెన్సీ లాండింగ్ ఫెసిలిటీ పూర్తి చేసేందుకు నిధులు మంజూరుకు చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు.

చందలూరు విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - పంగులూరు

ఇంకొల్లులోని రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ వారు నిర్వహించిన డిబేట్, ఎస్సే రైటింగ్ పోటీల్లో చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. గత నెల 29న మూఢనమ్మకాల నిర్మూలన, సైన్స్ వల్ల ఉపయోగాలు, శాస్త్రీయ దక్పథం, భారత రాజకీయాల్లో లౌకికవాదం అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. భారత హేతువాద సంఘం అధ్యక్షుడు వెంకటాద్రి మృతిచెందడంతో ఫలితాలు నిలుపుదల చేశారు. బుధవారం విజేతలను ప్రకటించారు. డిబేట్ పోటీలో జూనియర్ సెకండ్ ప్రైజ్ ఏడో తరగతి చదువుతున్న రిషిక్ మారుతి, సీనియర్స్ ఫస్ట్ ప్రైజ్ 9వ తరగతి చదువుతున్న హారిక సాధించారు. వ్యాసరచన పోటీల్లో జూనియర్స్ విభాగంలో ఫస్ట్ ప్రైజ్ ఏడో తరగతి చదువుతున్న సిరి చందన, సెకండ్ ప్రైజ్ ఏడో తరగతి చదువుతున్న జాహ్నవి సాధించారు. సీనియర్స్ విభాగంలో ఫస్ట్ ప్రైజ్ 9వ తరగతి చదువుతున్న రూప శ్రీ, సెకండ్ ప్రైజ్9వ తరగతి చదువుతున్న చంద్రిక సాధించారు. విజేతలకు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ అధ్యక్షతన బుధవారం అభినందన సభ నిర్వహించారు. పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు పోటీల్లో పాల్గొంటే ఆరుగురు విద్యార్థులకు బహుమతులు రావటం గొప్ప విషయం అని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుమ్మ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది ,పేరెంట్స్ కమిటీ చైర్మన్ కీర్తి శ్రీ, గ్రామ పెద్దలు అభినందించారు



బహుతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయుడు

ప్రాథమిక ఆర్యోగ కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి -కారంచేడు

మండల పరిధిలోని స్వర్ణప్రాథమిక ఆరోగ్య కేంద్రన్ని బాపట్ల జిల్లా డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ విజయమ్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వైద్యశాలలో నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలపై సమీక్షించారు. పిహెచ్‌సిలోని ల్యాబ్ రూమ్, గర్భిణుల పరీక్షల రిజిస్టర్స్ , యుఐపి సెషన్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం సచివాలయం-1 వద్ద గర్భిణుల రికార్డు నమోదు, ఇమ్యునైజేషన్ ఆర్‌సిహెచ్ పోర్టల్, ఆన్‌లైన్ యాప్‌లో వివరాల నమోదు తదితర అంశాలపై ఎఎన్ఎంలకు సూచనలు చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. స్వర్ణప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఆరు బెడ్స్ ఉండే వార్డుని నిర్మించడానికి ప్రపోజల్స్ సిద్ధం చేయాలని సూచించారు. ఆపరేషన్ థియేటర్ కూడా సిద్ధం చేయాలన్నారు. నూతనంగా విధుల్లో చేరిన వైద్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయ సిబ్బంది ఎస్‌కెఎం. జానీ, ఎంపిహెచ్ఒ లక్ష్మీనారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్, పిహెచ్‌సి సిబ్బంది, డాక్టర్ ఎం. శాలిని, డాక్టర్ ప్రియ ,హెచ్ఇ మీనా కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ బయ్య శంకర్ ,స్టాఫ్ నర్సులు మల్లేశ్వరి, క్షీరవర్ధిని, యుడిసి శాంతి లత, ఫార్మసిస్ట్ జ్యోత్స్న, ఎఎన్ఎం నాగలక్ష్మి, ఆశా వర్కర్లు బేబి, మరియమ్మ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ విజయమ్మ

ఎంపిడిఒకు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - పంగులూరు

రామకూరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పై ఉన్న అభియోగాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ పలువురు గ్రామస్తులు ఎంపిడిఒ రమణ మూర్తిని బుధవారం కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ,ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతున్నట్లు గత నవంబర్ 3న ఎంపిడిఒ కార్యాలయానికి ఒక అర్జీ వచ్చిందని, ఆ అర్జీలోని సంతకాలు అన్ని ఫేక్ సంతకాలేనని తెలిపారు. తమకు తెలియకుండానే కొందరుద తమ సంతకాలు చేసినట్లు తెలిపారు. అవి తమ సంతకాలు కాదని తెలిపారు. ఫేక్ సంతకాలు ఉన్న ఆ అర్జీని, తక్షణమే రద్దుచేయాలని కోరుతూ మరో అర్జీని ఎంపిడిఒ రమణమూర్తికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకూరు గ్రామ ఉపసర్పంచి ఎడవల్లి అశోక్ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



ఎంపిడిఒతో మాట్లాడుతున్న గ్రామస్తులు

వృద్ధులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది చంద్రబాబు కాలనీలో బుధవారం కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవ్వ తాతలకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరైన వారికి కంటి అద్దాలు రిఫర్ చేశారు. ఈ నెల 14, 15 తేదీల్లో మూలగుంట పాడులో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, కుష్బు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

స్వయం సహాయక సంఘాలు

ఆర్థికాభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి అద్దంకి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉన్నతి పథకం ద్వారా మార్కెట్ సదుపాయాలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకొని ఎస్‌సి, ఎస్‌టి స్వయం సహాయక సంఘాలు ఆర్థికాభివృద్ధి చెందాలని వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం సిహెచ్. కోటేశ్వరరావు తెలిపారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ బాపట్ల జిల్లా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన మండల స్థాయిలో దళిత, ఆదివాసి మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ మండలస్థాయిలో ఎస్‌సి,ఎస్‌టి స్వయం సహాయక సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ నిధుల ద్వారా స్వయం సహాయక సంఘాలను అభివద్ధి చేసుకొనేందుకు, ఉన్నతి ,ఆసరా పథకాలు ద్వారా ఆహార ఉత్పత్తులు తయారు చేసుకునే లఘు పరిశ్రమల ద్వారా ఆర్థికంగా స్థిరపడే వరకు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌సి,ఎస్‌టి స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివద్ధి వైపు పయనించాలన్నారు. వైఎస్ఆర్ క్రాంతి పథం కమ్యూనిటీ కో ఆర్డినేటర్ జి. సురేష్ మాట్లాడుతూ మహిళలు దారిద్ర రేఖకు దిగువనున్న వారు ఆర్థికంగా స్థిర పడేందుకు స్వయం సహాయక సంఘాల ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి మహిళా స్వయం సహాయక సంఘం చేరాలన్నారు. ఈ కార్యక్ర ౕమంలో వివిధ గ్రామాలకు చెందిన ఎస్‌సి,ఎస్‌టి మహిళలు, గ్రామ సంఘ సహాయకులు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎపిఎం కోటేశ్వరరావు

ఏల్చూరులో ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండల పరిధిలోని ఏల్చూరు గ్రామంలో హజరత్ కాలే మస్తాన్‌షా వలియా 131వ ఉరుసు మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుల మతాలకు అతీతంగా ప్రజలందరూ పాల్గొన్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. దర్గాలో ప్రత్యేక పూజలు మస్తాన్‌వలియా ఉరుసు సందర్భంగా గ్రామంలో రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. దర్గాను రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆట గుర్రాలతో స్వామి వారిని ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదానం నిర్వహించారు.



గ్రామస్తులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

10న వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ 32వ వార్షికోత్సవ వేడుకలు ఇంకొల్లులో ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు సెంటర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేడూరి సత్యనారాయణ, కరి హరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి హేతువాద, మానవవాద అధ్యయన తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆధునిక ప్రపంచంలో మత ఫండమెంటలిజం అంశంపై షేక్ బాబు, కరణం రవీంద్రబాబు, మతం-హేతువాదం అంశంపై షేక్ దరియావలి, డి.రాజశేఖర్ ప్రసంగిస్తారన్నారు. మేడూరి సత్యనారాయణ రచించిన జీవోత్పత్తి-జీవపరిణామం-మానవ పరిణామం గ్రంథాన్ని ఆలూరి ప్రఫుల్ల చంద్ర ఆవిష్కరిస్తారన్నారు. డాక్టర్ గుమ్మా వీరన్న రచించిన భారత తప్పదర్శనం- బౌద్ధం గ్రంథాన్ని మేడూరి సత్యనారాయణ ఆవిష్కరిస్తారన్నారు. మేడూరి సత్యనారాయణ రచించిన మానవవాదం- రాజకీయాలు-మానవ భవిష్యత్తు గ్రంథాన్ని షేక్ బాబు ఆవిష్కరిస్తరన్నారు. భౌతిక వాస్తవిక వాదం-హేతువాదం అంశాన్ని మేడూరి సత్యనారాయణ, కె.శ్రీనివాసాచారి, హేతుబద్ధ ఆలోచన- మానవవాద జీవన విధానం అంశంపై కుర్రా హనుమంతరావు, అడియాల శంకర్ ప్రసంగిస్తారన్నారు. మేడూరి స్యనారాయణ రచించిన వైజ్ఞానిక ప్రయోగాలు గ్రంథాన్ని కరి హరిబాబు, రావెల సాంబశివరావు రచించిన రావిపూడి వెంకటాద్రి రేషనలిస్ట్ అండ్ హ్యూమనిస్ట్ మూవ్‌మెంట్స్ గ్రంథాన్ని మేడూరి సత్యనారాయణ ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం రాడికల్ హ్యూమనిస్ట్ 32వ వార్షికోత్సవం, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభలో ప్రతిభ పోటీల్లోని విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.



వండర్‌మెన్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎంపిడిఒగా సీతారామారావు

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి ఎంపిడిఒగా కె.సీతారామారావు బాధ్యత స్వీకరించారు.గతంలో ఇక్కడ ఎంపిడిఒగా పనిచేస్తున్న వండర్‌మెన్ బదిలీపై వెళ్ళారు.ఆయన స్థానంలో సూపరింటెండెంట్ సీతారామారావును ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా నియమించారు. దీంతో సీతారామారావు బుధవారం ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీతారారావుకు ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్‌పిటిసి వేమాశ్రీనివాసరావు, నిప్పట్లపాడు ఎంపిటిసి చిన్నిపురెడ్డి వెంకటరెడ్డి, వైసిపి మండల మాజీ అధ్యక్షుడు దాసరి లక్ష్మినారాయణ, పి.నాయుడుపాలెం ఎంపిటిసి కూడల అంజలీ మాలకొండయ్య, వైసిపి నాయకులు ఏలూరి సుబ్బారావు,ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, ఎన్‌ఆర్ఇజిసి సిబ్బంది అభినందనలు తెలిపారు.

కూలీలకు ఆరోగ్య కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలకు ఆరోగ్య కిట్లను బుధవారం అందజేశారు. మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిపి నలమలపు అంజమ్మ చేతుల మీదుగా ఈ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బివివి.కుమారి, ఎపిఒ ధనుంజయవర్మ, వినోదరాయినిపాలెం సర్పంచి ఘట్టమనేని అశోక్ , నలమలపు కష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

పిడిఎఫ్ అభ్యర్థులను

ఎమ్మెల్సీలుగా గెలిపించుకుందాం

సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మార్చిలో జరగనున్న శాసనమండలి ఉపాధ్యాయ పట్టభద్రుల ఎన్నికలలో ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కషి చేసే పిడిఎఫ్ అభ్యర్థులు వెంకటేశ్వర రెడ్డి, పొక్కిరెడ్డి బాబురెడ్డి లను గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు పిలుపునిచ్చారు. ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేయడం లేదా తన అనుయాయులకు కట్టబెట్టడం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడే ప్రయత్నం చేయకుండా మోడీకి వంత పాడుతుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉద్యోగులు కార్మికులు నిరుద్యోగులు ప్రభుత్వ సంస్థల ఆవశ్యకతను తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. రాబోయే శాసనమండలి ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి బాలచంద్రం, నెల్లూరు డివిజన్ కమిటీ అధ్యక్షులు బెజవాడ శివయ్య జిల్లా అధ్యక్షులు, ఏ రామకోటి రెడ్డి ,జిల్లా నాయకులు బి వెంకటరావు, సిహెచ్ రాంబాబు ,బి హనుమంతరావు, పి. సుబ్బారావు ,మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

యాత్రికుల రక్షణ కోసమే..

- తీరంలో వాచ్ టవర్లు అందుకే..
- ఎస్పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

టూరిజం అభివద్ధి జరగాలంటే యాత్రికుల రక్షణ పరమైన చర్యలు పటిష్టంగా ఉండాలని బాపట్ల జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ తెలిపారు. బాపట్ల సూర్యలంక బీచ్ వద్ద యాత్రికులకు భద్రత పరమైన రక్షణ చర్యలు పెంపొందించే చర్యల్లో భాగంగా పోలీస్ వాచ్ టవర్లను నిర్మాణం కోసం బుధవారం ఎస్పి వకుల్ జిందాల్,బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి బుధవాంర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో యాత్రికులు సూర్యలంక బీచ్‌కు వస్తుంటారని తెలిపారు. ఏదైనా ప్రాంతంలో టూరిజం అభివద్ధి జరగాలంటే ఆ ప్రాంతంలో రక్షణ వ్యవస్థ కూడా పటిష్టంగా ఉండాలనే ఉద్దేశంతోనే సూర్యలంక ప్రాంతంలో పోలీసు నిఘానేత్రాన్ని మరింత అభివద్ధి చేసేందుకు పోలీస్ వాచ్ టవర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విశాఖ ఆర్కే బీచ్‌లో మాదిరిగానే సూర్యలంక బీచ్ లో కూడా వాచ్ టవర్స్ నిర్మాణం కోసం చర్యలు చేపట్టామన్నారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్ళగా సానుకూలంగా స్పందించి 3 వాచ్ టవర్లను ఏర్పాటు చేయటానికి సముఖత చూపించారన్నారు. త్వరలో టూరిజం అభివృద్ధి కోసం టూరిస్ట్ పోలీస్ అనే కాన్సెప్ట్ ఆవిష్కరించబోతున్నట్టు తెలిపారు. టూరిస్ట్ పోలీస్ యాత్రికులని గైడ్ చేయడం, వాళ్ళ రక్షణ అవసరాలు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూస్తారని తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్ల పరిధిలోని సూర్యలంక బీచ్ లో యాత్రికులకు రక్షణ ప్రమాణాలు పెంచడం కోసం ఎస్పి ప్రతిపాదన తీసుకొని రాగా వెంటనే అమలు చేయడానికి సముఖత చూపినట్లు చెప్పారు.వాచ్‌టవర్స్ నిర్మించేందుకు బిల్డర్స్ అసోసియేషన్ నుంచి గుండ్రెడ్డి శివ , బాపట్ల రైస్ మిల్లర్ అసోసియేషన్ , గోల్డెన్ సాండ్స్ రిసార్ట్స్ వారు ముందుకొచ్చినట్లు తెలిపారు. గతంలో ఉన్న వాచ్ టవర్ శిథిలావస్థకు చేరినట్లు తెలిపారు. సూర్యలంక ప్రాంతం హైదరాబాద్ కు దగ్గరలో ఉండటంలో అనేకమంది యాత్రికులు వస్తుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో వాచ్ టవర్లను వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ప్రతిష్టంగా నిర్మిస్తామని తెలిపారు. దీని ద్వారా టూరిజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సమీప ప్రాంతంలోని వారి జీవనోపాధి కూడా మెరుగుపడే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి పి. మహేష్ , బాపట్ల ఎస్‌సిడిపిఒ శ్రీనివాసరావు , ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఎ శ్రీనివాస్ , బాపట్ల రూరల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, బాపట్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కష్ణయ్య , బాపట్ల రూరల్, కర్లపాలెం, చందోలు ఎస్ఐలు, జిఎస్ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ చైర్మన్ గుండ్రెడ్డి శివ , బాపట్ల డిస్ట్రిక్ట్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బివి. రత్న గుప్తా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో ఎస్పి, బాపట్ల ఎమ్మెల్యే

రైతు నాయకుడు సురేష్ విడుదల

ఘనస్వాగతం పలికిన ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

కొల్లూరు మండలం చింతల్లాంక భూ పోరాటంలో అక్రమ కేసులు బనాయించటంతో జైలు పాలైన కౌలురైతు సంఘం జిల్లా నాయకులు తోడేటి సురేష్ బుధవారం విడుదలయ్యాడు. ఈ మేరకు సురేష్‌కు సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణ మోహన్, కొల్లూరు మండల పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. కమ్యూనిస్టులకు జైళ్ల కొత్తేమి కాదని, చింతల్లాంక ఆర్‌సి భూముల్లో పేద దళితులకు పట్టాలు ఇచ్చేంత వరకు పోరాటం ఆగదన్నారు. ఎలాంటి అక్రమ కేసులకూ భయపడేది లేదని, ఐకమత్యంలో భూములు సాధించి తీరుతామని గంగయ్య తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి.అగస్టీన్, నాగ మల్లేశ్వరరావు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.



సురేష్‌కు స్వాగతం పలుకుతున్న గంగయ్య, ప్రజాసంఘాల నాయకులు

చెంచు గిరిజనులను

ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు..

- గిరిజనులను అధికారులు వేధిస్తే ఊరుకోం.. - ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

అడవిలో జీవించే హక్కు చెంచు గిరిజనులకు ఉందని, వారిని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదని రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవి బాబు పేర్కొన్నారు. పెద్ద దోర్నాల మండలంలోని పెద్ద చామ చెంచుగూడెంలో ఆయన అధికారులతో కలిసి మంగళవారం రాత్రి బస చేశారు. ముందుగా స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా బ్రిటీష్ వారితో పోరాడి అమరులైన చెంచుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పిం చారు. చెంచులతో ముఖాముఖి నిర్వహిం చారు. వారి పమస్యలు అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సౌకర్యాల పట్ల ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన చెంచులకు నేటికి కూడా విద్యుత్ సౌకర్యం లేకపోవడం, మరికొన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదన్నారు. దీనంతటికీ అటవీశాఖ అధికారులు సహకారం లేకపోవడమే కారణమన్నారు. తన పర్యటనలో పాల్గొనని రెవెన్యూ, విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రాత్రికి చెంచులు తినే అటవీ సంపదతో కూడిన కూడిన ఆహారాన్ని రుచి చేశారు. చెంచులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంచెపై నిదురించారు. రాత్రి 9.30 నిమిషాల సమయంలో ఎలుగుబంటి అరుపులు వినిపించడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అర గంట తర్వాత శబ్దాలు తగ్గడంలో ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీ కమీషన్ సభ్యులు వడితె శంకర్ నాయక్, జంపర రంగ లిల్లి, కొర్రా రాములు, మురళిఐటిడిఏ పిఓ రవీంద్రారెడ్డి, ఏపిఓ మురళి, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాధరాఇవు డిఎల్‌డిఓ సాయికుమార్, పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవి

హెలీప్యాడ్ స్థలంలో ఎగ్జిబిషన్.!

- ఎబిఎం కళాశాల యాజమాన్యం ఇష్టారాజ్యం
- కలెక్టర్ ఆదేశాలను పక్కన పెట్టి.. అనుమతులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న ఎబిఎం కళాశాల గ్రౌండ్ చుట్టూ వివాదాలు అలుముకుంటున్నాయి. తమ స్వలాభాల కోసం గ్రౌండ్‌లో అడ్డగోలుగా కళాశాల యాజమాన్యం అనుమతలు ఇవ్వడం వివాదాలకు కారణం అవుతోంది. కళాశాల ప్రాంగణంలోని ఆట స్థలంలో ఎగ్జిబిషన్ పెట్టుకునేందుకు ఇటీవల అనుమతి ఇచ్చారు. ఎబిఎం స్కూల్‌లో పదో తరగతి,ఇంటర్ విద్యార్థులకు క్లాసులు జరుగుతున్నాయి. త్వరలోనే పబ్లిక్ ఎగ్జామ్స్ కూడా ఉన్నాయి. అది ఎగ్జామ్ సెంటర్ కూడా. అక్కడ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తే చదువులకు ఆటంకం ఏర్పడుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రణగొణధ్వనుల మధ్య తామెలా చదువుకోవాలని అక్కడున్న హాస్టల్ విద్యార్థులూ ప్రశ్నిస్తున్నారు. మరోవైపు కళాశా గ్రౌండ్ మొత్తం నెలల తరబడి ఎగ్జిబిషన్ నిర్వహించుకునేందుకు ఇవ్వడంతో ఆటలకు కూడా అంతరాయం ఏర్పడుతోందని స్థానికంగా చుట్టుపక్కల నివాసం ఉంటున్న యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు వందలాది మంది యువకులు అక్కడ చేరి ఉదయం, సాయంత్రం ఆటలు ఆడుకుంటుంటారు. వాకింగ్ ట్రాక్‌లో వాకర్స్ వాకింగ్ చేస్తుంటారు. ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇవ్వడంతో వారి ఆటలకు బ్రేక్ పడినట్లయ్యింది. వాకర్స్‌కు కూడా ఇది అంతరాయమే. నగరంలో ఏదైనా క్రీడలు జరుపుకునేందుకు ఉన్న పెద్ద గ్రౌండ్‌లలో ఎబిఎం గ్రౌండ్ కూడా ఒకటి. ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇవ్వడంతో అక్కడ ఎలాంటి క్రీడలు నిర్వహించుకునేందుకు అవకాశం ఉండదు. మరోవైపు కళాశాల ప్రాంగణంలో అత్యవసరంగా హెలికాప్టర్లు ల్యాండ్ అయ్యేందుకు గాను అక్కడ హెలిపాడ్ ఉంది. దీని మీద ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. కలెక్టర్ అనుమతి లేనిదే హెలిపాడ్ స్థలం ఎవరికి ఇవ్వరాదనే ఆదేశాలు ఉన్నాయి. దాన్ని దిక్కరించి ఇప్పుడు అనుమతులు ఇవ్వడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేరుగా హెలిపాడ్ స్థలంమీదనే ఎగ్జిబిషన్ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతుండటం చర్చనీయాంశం అయ్యింది. అత్యసర పరిస్థితులు ఏమైనా ఎదురైతే ఎవరు బాధ్యులు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎబిఎం యాజమాన్యంలోని ఓ వర్గం వారు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. వారి వ్యక్తిగత ఆదాయం కోసం కొంతమంది గ్రౌండ్‌ను ఎగ్జిబీషన్‌కు అనుమతి ఇచ్చినా ప్రభుత్వ శాఖల అధికారులు దీన్ని ఎందుకు ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అన్నీ కోణాల్లో ఆలోచించి ఎవరికి అభ్యంతరం లేని చోట ఎగ్జిబిషన్‌లకు అనుమతి ఇస్తారు. అయితే మున్సిపాలిటీ, అగ్నిమాపకశాఖ, పోలీసు శాఖలోని పలువురు అధికారులు వారి స్వప్రయోజనాల కోసం గ్రౌండ్‌లో వినోదాలకు అనుమతులు ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఓ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అక్కడ ముందుకుగా అనుమతి ఇచ్చినప్పటికీ తరువాత దాన్ని రద్దు చేశారు. అక్కడ పిల్లల చదువులకు ఆటకం అనే పాయింట్‌ను నాడు పోలీసులు ప్రస్తావించారు. ఒక్కరోజు ఫంక్షన్‌కే పిల్లల చదువులకు ఆటంకం అని చెప్పిన పోలీసులు ఇప్పుడు నెలల తరబడి ఎగ్జిబిషన్ ఏర్పాటుకు ఎలా అనుమతి ఇచ్చారనే చర్చ జరుగుతోంది. అక్కడ ఎగ్జిబిషన్‌కు ఇచ్చిన అనుమతులు రద్దుచేయాలనిఆప్రాంతానికి చెందిన పలువురు సీనియర్ సిటిజన్లు నగర మేయర్, కమిషనర్‌ను కలిసి చర్చించినట్లు సమాచారం.



ఎబిఎం కళాశాల గ్రౌండ్